ప్రజాశక్తి

బుధవారం 4 జూన్ 2025

5

పార్వతీపురం మన్యం

హైకోర్టు జడ్జిని కలిసిన జిల్లా జడ్జి, కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

గుజరాత్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జడ్జి సిహెచ్ మానవేంద్రనాథ్ రాయ్‌ను విజయనగరం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎం.బబిత, కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. పార్వతీపురం విచ్చేసిన న్యాయమూర్తిని ఆయన స్వగృహంలో కలిశారు.

హైకోర్టు జడ్జికి పూలమొక్కను అందజేస్తున్న జిల్లా జడ్జి బబిత

ఇంటింటా జ్వర పీడితులే...

- ప్రబలుతున్న మలేరియా, టైఫాయిడ్
- సరిపడే బెడ్లు లేవు..!
- అందుబాటులో లేని ప్రత్యేక వైద్య శిబిరాలు

ప్రజాశక్తి- కురుపాం

కురుపాంతో పాటు ఏజెన్సీలోని అన్ని గ్రామాల్లో జ్వరాల తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా గ్రామాల్లో జ్వర పీడితులు ఎక్కువయ్యారు. ప్రతి ఇంటికీ ఇద్దరు, ముగ్గురు జ్వరం బారిన పడుతుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఒక్కసారిగా జ్వరాలు ఎక్కువ కావడం వల్ల ఏజెన్సీ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీంతో స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంతో పాటు మొండెంఖల్, నీలకంఠాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. రోగులు ఎక్కువ మంది కావడంతో ఒక బెడ్‌పై ఇద్దరు, ముగ్గురేసి చొప్పున రోగులకు వైద్యం అందిస్తున్నారు. ఇదే అవకాశం చూసుకున్న ఆర్‌ఎంపి వైద్యులు ఏజెన్సీ నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. సాధారణ జ్వరమైనప్పటికీ అనేక రకాల పరీక్షలు నిర్వహించి వేలకు వేలు బిల్లులు వేస్తున్నారు. అవసరం లేకపోయినా వివిధ రకాల పేర్లతో పరీక్షలు జరిపి ప్రయివేటు ల్యాబ్ నిర్వాహకులు వేల రూపాయలు ఫీజు తీసుకుంటున్నారు. రోగనిర్ధారణ పేరిట గిరిజనులను నిలువునా దోచుకుంటున్నారు. గ్రామాల్లోకి వెళ్లి సేవలు అందించాల్సిన వైద్య సిబ్బంది తూతూ మంత్రంగా వ్యవహరిస్తుండడం, ముందస్తు శానిటేషన్ చర్యలు చేపట్టక పోవడం, జ్వరాలపై అవగాహన కల్పించకపోవడంతో ఆర్‌ఎంపి వైద్యులు భారీగా వ్యాపారం చేసుకుంటున్నారు. ఆర్‌ఎంపి వైద్యశాలతో పాటు ప్రతి వైద్యశాల కిక్కిరిసిపోయి ఉండడం ఏజెన్సీ గ్రామాల్లోని జ్వరాల తీవ్రతకు అద్దంపడుతుంది. ఇక్కడ నుంచి పార్వతీపురం ప్రైవేట్ వైద్యశాలలకు రోగులు వెళు_న్నారు. గ్రామాల్లో ఒకే ఇంట్లో ఇద్దరు లేక ముగ్గురు జ్వరంతో బాధ పడుతుండడంతో. వారి ఉపాధికి కూడా ఆటంకంగా మారింది. అధికారులు వెంటనే స్పందించి గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అధిక నగదు వసూలు చేస్తున్న వారిపై సంబంధిత జిల్లా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రజలు కోరుతున్నారు.

రోగులకు కిటకిటలాడుతున్న కురుపాం సిహెచ్‌సి

రెండు రోజులుగా ఒకే బెడ్ పై ఇద్దరం ఉన్నాం

నాకు జ్వరం వస్తే రెండురోజుల క్రితం మా అమ్మ కురుపాం ఆస్పత్రికి తీసుకొచ్చింది. జ్వరం ఎక్కువగా ఉండడంతో వైద్యులు ఆస్పత్రిలో చేర్చుకున్నారు. బెడ్లు సరిపడా లేకపోవడంతో శివన్నపేట గ్రామానికి చెందిన సీలవంశపు శివాని అనే అమ్మాయికి, నన్ను ఒకే బెడ్ దగ్గర ఉంచి చికిత్స అందజేస్తున్నారు. వైద్యం బాగానే అందిస్తున్నారు.

ఆరిక కావేరి,
జోంగరపాడు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనులు మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల తీవ్రతతో ఎక్కువగా బాధపడుతున్నారు. ప్రభుత్వ సేవలు సక్రమంగా అందకపోవడంతో ఆర్‌ఎంపి వైద్యులు ఆశ్రయించి వేలాది రూపాయలు తగలబెట్టి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించి ప్రాణాలను కాపాడాలి.

ఎం.రమణ,
గిరిజన సంఘం జిల్లా కోశాధికారి.

50 పడకల ఆసుపత్రి తక్షణమే ప్రారంభించాలి

నియోజవర్గ కేంద్రమైన కురుపాంలో గల సామాజిక ఆరోగ్య కేంద్రంలో బెడ్‌లు కొరత వల్ల ఒక్కొక్క బెడ్‌కు ఇద్దరేసి ముగ్గురేసి రోగులు చొప్పున ఉండి వైద్యం పొందాల్సి వస్తుంది. కురుపాం సిహెచ్‌సి పక్కన 50 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయి చివరి దశలో ఉన్నటు వంటి ఆసుపత్రిని, ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు స్పందించే తక్షణమే ప్రారంభించి రోగులకు వైద్యంతో పాటు బెడ్ల సౌకర్యం కల్పించాలి.

ఎం.శ్రీనువాసరావు
గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి.

ఘనంగా సిరిమానోత్సవాలు

- అంబరాన్ని తాకిన సంబరాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- హోరెత్తించిన బాణాసంచా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలో మంగళవారం ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ, బంగారమ్మ అమ్మవార్ల అనుపోత్సవాల్లో జరిగే 2 సిరిమానుల తిరువీధి, అమ్మవారి పాలజంగిడి, ఘటాల ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రవమాలు, పలు వేషధారణలతో సంబరాలు అంబరాన్ని తాకాయి. ఈ అనుపోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు లక్షలాది మంది ప్రజలు రెండు రోజులు ముందుగానే పట్టణానికి చేరుకోవడంతో పట్టణం కిక్కిరిసింది. కార్యక్రమంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించింది.

అనుపోత్సవాల్లో కీలక ఘట్టం సినిమానోత్సవాలు

మంగళవారం సాయంత్రం 6.45 నిమిషాలకు ప్రారంభం కావాల్సిన సిరిమానోత్సవానికి వర్షం కురవడంతో కాస్త ఆలస్యంగా ప్రారంభమైంది. ఇప్పల పోలమ్మ అమ్మవారి సిరిమానును జన్ని కులానికి చెందిన అరిక రాజారావు అధిరోహించిగా, ఎర్ర కంచమ్మ అమ్మవారి సిరిమానును జగన్నాధపురంలో గూల కులానికి చెందిన నక్క రవి అధిరోహించారు. ఈ రెండు అమ్మవార్ల ఉత్సవ కమిటీ సభ్యులు అమ్మవారి అనుపోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు..

స్వచ్ఛంద సేవా కార్యక్రమాల్లో పలువురు..

ఇద్దరు అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం పట్టణంలోని పలువురు స్వచ్చందంగా తాగునీరు, మజ్జిగ, పులిహోరా, వాటర్ బాటిల్స్ తదితర వాటిని ఉచితంగా పంపిణీ చేసేందుకు ముందుకు రావడం విశేషం.

450 మంది పోలీస్ బందోబస్తు

ఈ రెండు పండగల నేపథ్యంలో భక్తుల తాకిడి ఎక్కువగా కావడంతో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఎస్పీ మాధవరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, జెసి శోబిక, ఎఎస్పీ అంకిత సురాన ప్రత్యేక పర్యవేక్షణ చేశారు. పలువురు అధికారులు సమన్వయంతో 450 మంది పోలీస్ అధికారుల సిబ్బందితో పట్టణ సిఐ మురళీధర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు..

పట్టణంలో సాగుతున్న సిరిమానోత్సవం

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఇప్పల పోలమ్మ సిరిమానోత్సవానికి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయనే చెప్పవచ్చు. విజయనగరంలోని గాజుల రేగ నుండి దాసరి రాము మాస్టారు పులి వేషాలు, వీరఘట్టం బల్ల వేషాలు, బొబ్బిలి నుండి తీన్మార్ డప్పులు, ఏలూరు నుండి బొబ్బిలి అనంతరావు ట్రూపు అమ్మవారి నవదుర్గా వేషాలు, తాడేపల్లిగూడెం నుండి అఘోర వేషాలు అలరించాయి. బలిజిపేట మండలం వెంగాపురం మందు గుండు సామాగ్రి హెూరెత్తించింది.

అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యేలు

పండగ నేపథ్యం స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆహ్వానం మేరకు కురుపాం, పాలకొండ ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, నిమ్మక జయకృష్ణ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పండగ సందర్భంగా పట్టణమంతా శోభాయమానంగా వెలుగొందుతోంది. పట్టణమంతా భారీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఎక్కడికక్కడ తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలను ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తొలిరోజు నుండి అధికారులు, కమిటీ నాయకులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లను పర్యవేక్షించారు. దీంతో భక్తులు సంతోషం వెలిబుచ్చుతున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు జయకృష్ణ, జగదీశ్వరి, విజయచంద్ర

అలరిస్తున్న పులవేషా

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, గిరిజనులు

సాగు భూములకు పట్టాలివ్వాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు

ప్రజాశక్తి - కురుపాం

గిరిజనులు సాగు చేస్తున్న భూమికి డి-పట్టాలు ఇవ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం జియ్యమ్మవలస తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలమండలో సర్వే నంబర్ 177లో సుమారు 100 ఎకరాల భూమిని గత 40 ఏళ్లుగా గిరిజనులు సాగుచేస్తున్నారని, అనేక సార్లు పట్టాల కోసం దరఖాస్తులు చేసినప్పటికీ ఇంత వరకూ పట్టాలు మంజూరు చేయలేదని అన్నారు. ఒక్క అలమండ పంచాయతీ కాకుండా తుంబలి, చంద్రశేఖర్ రాజుపురం, రావాడ, లక్ష్మీ పేట, బల్లేరు, కిడిగేసు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు ముందు సాగు భూమిని గుర్తించి అనంతరం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పట్టాలిచ్చేంత వరకూ పోరాడుతామని అన్నారు. అనంతరం తహశీల్దార్ చిన్నారావుకు వినతిపత్రం అందించారు. దీనికి తహశీల్దార్ స్పందించి పరిశీలన చేసి అర్హులకు పట్టాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కె.సీతారాం, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు భూటాల మోహన్‌రావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి గోరపాడు సోమయ్య, గిరిజనులు పాల్గొన్నారు.

తోటపల్లి ఎడమ కాలువకు నీరివ్వాల్సిందే : సిపిఎం

ప్రజాశక్తి - పాలకొండ

తోటపల్లి ఎడమ కాలువకు నీరివ్వాల్సిందేనని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎడమ కాలువ ఆయకట్టు రైతులు గత నెల రోజులుగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తున్నప్పటికీ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖాధికారులు ఎటువంటి హామీ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ఈ ఖరీఫ్‌లో వరి పంట వేసుకోవాలా? లేదా? అన్న అయోమయ స్థితిలో రైతులు ఉన్నారన్నారు. వందేళ్ల క్రితం నిర్మించిన తోటపల్లి ప్రాజెక్టుకు ఆధునీకరణ పనులు జరగకపోవడంతో 11 ఏళ్లుగా ఈ ప్రాంత రైతులకు నీరందకపోవడం దారుణమన్నారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా పట్టించుకోలేదని విమర్శించారు. గత ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ 23 శాతమే పనులు జరిగాయన్న నెపంతో కూటమి ప్రభుత్వం ఆ నిధులను వెనక్కి తీసుకుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా ఇంత వరకు దీనిపై ఊసే లేదన్నారు. షట్టర్లు సరిగ్గా లేవని, మదుములు పూర్తిగా పాడయ్యాయని, లస్కర్ల కొరత తీవ్రంగా ఉందని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టర్, సబ్ కలెక్టర్‌తో పాటు ఇరిగేషన్ అధికారులు ఈ సమస్య పరిష్కరించకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్ దీనిపై దృష్టి పెట్టాలని, అలాగే ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కూడా ఈ విషయంలో కలుగజేసుకొని సమస్య పరిష్కరించాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఎం నాయకులు దావాల రమణారావు, రాము ఉన్నారు.

పిఎం సూర్యఘర్ పర్యావరణ హితం

ప్రజాశక్తి - పార్వతీపురం

పిఎం సూర్యఘర్ పర్యావరణ హితమైందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పర్యావరణ దినోత్సవం, పిఎం సూర్యఘర్, తదితర అంశాలపై మంగళవారం జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామంలో ఎక్కువ యూనిట్లు విద్యుత్ ఖర్చు చేస్తున్న వారికి పిఎం సూర్యఘర్ ఎంతో ప్రయోజనకరమన్నారు. పిఎం సూర్యఘర్ కు రుణం అందిస్తామన్నారు. పర్యావరణ దినోత్సవం రోజున పెద్ద ఎత్తున పిఎం సూర్యఘర్ యూనిట్లు ప్రారంభించి పర్యావరణ మిత్రులుగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

ప్రతి మొక్క బతకాలి

పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలో జూన్ 5న సామూహిక మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఐదు లక్షల మొక్కలు నాటుట లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అటవీశాఖ వద్ద 15 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఉపాధి హామీ పథకం కింద 6 వేల కొబ్బరి మొక్కలు స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నాటుతున్నట్టు తెలిపారు. మొక్కల అవసరాలను డ్వామా, జిల్లా గ్రామ పంచాయతీ అధికారికి అందించాలని ఆదేశించారు. ఫారం పాండ్స్, ఖాళీగా ఉన్న పాఠశాలల ఆవరణలు, పురపాలక సంఘాల స్థలాలు, జలవనరుల స్థలాలు, పంచాయతీ, అటవీ శాఖ స్థలాల్లో మొక్కలు నాటాలని ఆదేశించారు. ప్రతి మొక్కకు రక్షణగా స్థానిక వనరులతో కంచె ఏర్పాటు చేయాలన్నారు. మొక్కలు బతకాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. జూన్ 5న ప్రతి మండలంలో కనీసం 15 వేల మొక్కలు నాటేందుకు అవసరమగు స్థలాలు గుర్తించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు.

చౌక ధరల దుకాణాల్లో సీసీ కెమెరాలు

చౌక ధరల దుకాణాలకు వచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. పర్యవేక్షణకు అవసరమైతే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక మాట్లాడుతూ ప్రజలు చౌక ధరల దుకాణాలకు వచ్చి వీలైనంత వేగంగా వెనుదిరిగేలా పని చేయాలన్నారు. వికలాంగులు, 65 ఏళ్లపైబడిన వారికి ఇంటి వద్దనే రేషన్ అందించడం జరుగుతుందని స్పష్టం చేశారు. చౌక ధరల దుకాణాలు ఉదయం 8 గంటలకు విధిగా ప్రారంభం కావాల్సిందేనని స్పష్టం చేశారు.

8న కురుపాంలో సీనియర్ సిటిజన్ లతో యోగాంధ్ర

కురుపాంలో ఈనెల 8న సీనియర్ సిటిజన్లతో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈనెల 5న సీతంపేటలో పర్యాటక ప్రాంతాల్లో యోగా కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యోగాంధ్ర శిక్షణ కార్యక్రమాలు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో పార్వతీపురం, పాలకొండ సబ్‌కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు ఎం.సుధారాణి, కె.రామ చంద్ర రావు, డిపిఒ తమర్భ కొండలరావు, ఐటిడిఎ ఎపిఒ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

కౌలు రైతుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - బలిజిపేట

గ్రామ సభలు పెట్టి కౌలు రైతులను గుర్తించి భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని స్థానిక తహశీల్దార్ రత్నకుమారికి మండలంలోని కౌలురైతులు మగళవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి రమణమూర్తి మాట్లాడుతూ మండలంలో సుమారు 2వేల మంది కౌలు రైతులు ఉన్నారని, గతేడాది 1060 మందికి మాత్రమే కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చి మిగతా రైతులకు అన్యాయం చేశారన్నారు. కావున గ్రామసభలు పెట్టి కౌలు రైతులను గుర్తించి కార్డులు ఇవ్వాలని కోరారు. అన్నదాత సుఖీభవ రూ.20వేలు పెట్టుబడి సహాయం కౌలు రైతులకు అందించాలని వాస్తవ సాగుదారుల పేరుతోనే ఇ- క్రాప్ నమోదు చేయాలని అన్నారు. భూమి స్వభావంతో సంబంధం లేకుండా వేసిన ప్రతి పంటకు ఇ-క్రాప్ చేయాలి, కౌలు రైతులు, సాగుదారులు పంట రుణాలను రీ షెడ్యూల్ చేసి కొత్తగా పంట రుణాలు ఇవ్వాలని, 2011 చట్టాన్ని అమలు చేసి కౌలురైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గేదెల సత్యనారాయణ, నాయకులు బొద్దాన భానుమూర్తి, ప్రజా సంఘాల నాయకులు వై.మన్మధరావు, లక్ష్మమ్మ, గౌరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రాళ్లు తేలిన రోడ్డుపై రేషన్‌కోసం అవస్థలు

ప్రజాశక్తి - కొమరాడ

ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు ఏదో ఒక రూపంలో ఇబ్బందులు కష్టాలు తప్పడం లేదన్నమాట ఈ పోటో చూస్తే నమ్మాల్సిన పరిస్థితి ఉంది. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామన్న ప్రభుత్వ ఆర్భాట ప్రచారాల తప్ప క్షేత్రస్థాయిలో గిరిజనులకు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకునే ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులే కరువయ్యారని గిరిజనుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి ఘటన కొమరాడ మండలంలోని జరుగుతున్నా అనేక సందర్భాల్లో బయట ప్రపంచానికి తెలియజేసినా అవి ఆ క్షణం వరకే తప్ప ఆ తర్వాత వారి సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని గిరిజనులు వాపోతున్నారు. కొమరాడ మండలంలోని ఇప్పటికీ అనేక గిరిజన గ్రామాలకు రోడ్డు సదుపాయాలు లేకపోవడంతో రాకపోకలు చేసేందుకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో గల అనేక గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయాలు లేకపోయినా గిరిజన ప్రాంతాల అభివృద్ధి ధ్యేయమని పాలకులు, అధికారులు చెబుతున్నా అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి తప్ప క్షేత్రస్థాయిలో ఎక్కడా గిరిజనులను అభివృద్ధి చేసేందుకు పథకాలు పనిచేయకపోవడంతో వెనుకబాటు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గత వైసిపి ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ పంపిణీ పేరుతో వాహనాలను ఏర్పాటు చేసినప్పటికీ రోడ్డు సదుపాయాల్లేక గిరిజన గ్రామాలకు ఇంటింటికీ రేషన్ పంపిణీ వ్యాన్ వెళ్లే పరిస్థితి లేదు. దీంతో ఎక్కడో ఒక ప్రదేశంలో రేషన్ ఇచ్చే వారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రేషన్ వాహనాలను రద్దు చేయడంతో కుంతేసు, పుడేసు పంచాయతీల పరిధిలో గల సుమారు 15 గ్రామాలు గిరిజనులకు ఎండభద్ర జిసిసి డిపోలో రేషన్ పంపిణీ జరుగుతుంది. దీంతో బియ్యం విడిపించుకునేందుకు గిరిజనులు గిరి శిఖర ప్రాంతాల్లో ఉన్న కుంతేసు, బిన్నిడి గొర్లెమ్మ తదితర గ్రామాల ప్రజలు రాళ్లు తేలిన రహదారిపై నడుచుకొని నరకం అనుభవించి రేషన్ కోసం అష్ట కష్టాలు పడుతూ మైదాన ప్రాంతాలకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో వేసిన రహదారులు తుతుమాత్రంగా చేసి బిల్లులు చెల్లింపులు చేసినప్పటికీ సక్రమంగా రహదారి సదుపాయాలు లేకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్లన్నీ కోరుకుపోతున్నాయి. దీంతో రేషన్ కోసం రాళ్ల తేలిన రహదారిపై నరకయాతన అనుభవిస్తూ గిరిజనులు తిండి గింజల కోసం వ్యయ ప్రయాసలు చేసి రాళ్లపై నడుచుకొని వెళ్తున్నారు. కొన్ని సమయంలో రాళ్లపై నడుచుకొని వెళ్లేటప్పుడు గిరిజనులు కింద పడిపోయి గాయాలపాలైన ఘటనలు కూడా గతంలో అనేకం జరిగాయి. రహదారి సదుపాయం ఏర్పాటు చేస్తే గిరిజన మారుమూల గ్రామాలకు అన్ని వసతులు సమకూర్చేందుకు ప్రభుత్వానికి అధికారులకు సులభతరంగా ఉంటుందని ఆ దిశగా ఎప్పటికైనా కూటమి ప్రభుత్వం గిరిజన రహదారులపై దృష్టి పెట్టి ప్రతి గిరిజన గ్రామానికి రోడ్డు సదుపాయం కల్పించేలా చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

రాళ్లుతేలిన రోడ్డుపై రేషన్ సరుకులు మోసుకెళ్తున్న గిరిజనులు

వృద్ధులకు రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

వృద్ధుల ఇళ్ల వద్దకే రేషన్ : జెసి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో చౌక ధరల దుకాణాల నుంచి నిత్యావసర వస్తువులను వికలాంగులకు, 65 సంవత్సరాల వయసు దాటిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందజేస్తామని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్. శోబిక తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు వృద్ధులు, వికలాంగులు రేషన్ దుకాణాల వద్ద క్యూ లైన్లలో వేచి ఉండాల్సిన అవసరం లేదన్నారు. రేషన్ డీలర్ స్వయంగా ఇంటి వద్దకు వచ్చి మీకు రావాల్సిన రేషన్ సరుకులను అందజేస్తారని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఒక ఆడియో క్లిప్ ను కూడా విడుదల చేశారు.

పార్వతీపురం రూరల్: దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడిన వారి ఇళ్ల వెళ్లి రేషన్ అందజేసే విధానాన్ని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ మండలంలోని నర్సిపురం, బెలగాం చౌక ధరల దుకాణాలలో మంగళవారం తనిఖీ చేశారు. నిత్యావసర సరుకుల నిల్వలు సరిపడా ఉంటాయని, అనుమానాలు వద్దని ఆయన చెప్పారు. చౌక ధరల దుకాణాలకు వచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. చౌక ధరల దుకాణాలు ఉదయం 8 గంటలకు విధిగా ప్రారంభం కావాల్సిందేనని స్పష్టం చేశారు.

సబ్ జైలును తనిఖీ చేస్తున్న జిల్లా జడ్జి బబిత

సబ్ జైల్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక సబ్ జైల్‌ను విజయనగరం ప్రిన్సిపల్ జిల్లా జడ్జి ఎం.బబిత మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. జైలులో వసతులను పరిశీలించారు. ఖైదీలతో ముఖాముఖి మాట్లాడి పరిస్థితుల పట్ల ఆరా తీశారు. నిబంధనల ప్రకారం నడుచుకోవాలని ఆదేశించారు. ఖైదీల ఆరోగ్యం గురించి తీసుకుంటున్న చర్యలను సబ్ జైల్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. జైలు లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను తనిఖీ చేశారు. జైలులోని పలు విభాగాలను పరిశీలించారు. ప్రిజన్ లీగల్ ఎయిడ్ క్లినిక్ గురించి ఖైదీలకు వివరించారు. ఒక అడ్వకేట్, ఒక పారాలీగల్ వాలంటీర్ ఉంటారని, వారు ఖైదీలకు న్యాయసలహాలు అందిస్తారని చెప్పారు. ఖైదీలు సత్ప్రవర్తనతో శిక్షను పూర్తిచేసుకోవాలని సూచించారు. న్యాయవాదులు లేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదులను నియమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్వతీపురం రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు, లోక్ అదాలత్ సభ్యులు టి. జోగారావు తదితరులు పాల్గొన్నారు

రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ పద్మావతి

పిహెచ్‌సిలో డిప్యూటీ డిఎంహెచ్ఒ తనిఖీ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఐటిడిఎ డిప్యూటీ డిఎంహెచ్ఒ కెవిఎస్ పద్మావతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ కరోనా విజృంభిస్తుందని, దీనికి సంబంధించి ప్రజలకు అవగాహన కలిగించి, తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా చెప్పాలన్నారు. గ్రామస్థాయిలో ఆశా కార్యకర్తలు, ఇతర సిబ్బంది అప్రమత్త చేసి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి పి.ఉషారాణి, సిహెచ్ఒ ఎస్‌వి రమణ, యుడిసి మురళి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

18న రెడ్ క్రాస్ నూతన కార్యవర్గం నియామకం

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావేశం ఈ నెల 18న జరుగుతుందని జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ ప్రెసిడెంట్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 18న ఉదయం 11 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహిస్తామని ఆయన చెప్పారు. సమావేశంలో జిల్లాకు సంబంధించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. రెడ్ క్రాస్ జిల్లా బ్రాంచ్ మేనేజింగ్ కమిటీ సభ్యులను, చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారి, ఇతర సభ్యులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు తప్పనిసరిగా హాజరై విజవంతం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

యోగాంధ్ర సందర్భంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉల్లిభద్ర సెక్టార్ పరిధిలోని ఉలిభద్ర, తదితర గ్రామాల్లో నిర్వహించిన రంగవల్లుల పోటీలు అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు. అంగన్వాడి వర్కర్లు మరడాన కల్పన, తదితరులు ముగ్గులు వేశారు. ముగ్గులు పరిశీలించిన అనంతరం వర్కర్లను అధికారులు అభినందించారు. కార్యక్రమంలో కొమరాడ ఐసిడిఎస్ సిడిపిఒ గొట్టాపు సుగుణకుమారి, సూపర్వైజర్ రౌతు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీకి సిద్ధం

ప్రజాశక్తి - సాలూరురూరల్

మండలంలోని అన్ని పాఠశాలలకు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు అన్ని రకాల పుస్తకాలు విద్యార్థులకు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఎంఇఒ-2 ఎన్.వెంకటరావు తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలలకు 45 వేల పుస్తకాలను విద్యార్థులకు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, గతంలో తెలుగు, ఆంగ్లం, హిందీ భాషా పుస్తకాలు వేర్వేరుగా ఉండేవని, కానీ ఈ ఏడాది నుంచి ఆ సబ్జెక్టులు కలిపి ఒకే పుస్తకంగా వచ్చాయని, గణితం, సామాన్య శాస్త్రం, సోషల్ పుస్తకాలు కలిపి ఒక్కొక్క విద్యార్థికి నాలుగు పుస్తకాలు పంపిణీ చేయడానికి పాఠశాలలు తెరిచేనాటికి అందజేస్తామని ఆయన తెలిపారు.

బలిజిపేటలో మలేరియా మాసోత్సవాలు

ప్రజాశక్తి - బలిజిపేట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో మంగళవారం మలేరియా మాసోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ నెలలో మలేరియా జ్వరాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. జూన్ 1 నుంచి 30 వరకు ఈ మాసోత్సవాలు ప్రతి హెల్త్ క్లినిక్ లో జరుగుతాయని తెలిపారు.

వెన్నుపోటు జగన్ రెడ్డిదే : భూదేవి

ప్రజాశక్తి - సీతంపేట

కుంభకోణాల నుంచి ప్రజా దృష్టి మళ్లించడానికే ధర్నాల డ్రామా ఆడుతున్న జగన్ ముఠా అని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పడాల భూదేవి అన్నారు. మంగళవారం స్థానిక విలేకరలుతో మాట్లాడారు. తొలి ఏడాదిలో 10శాతం హామీలను అమలు చేయని జగన్ ప్రభుత్వమని విమర్శించారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలోనే 70శాతం హామీలు అమలు చేసినది కూటమి ప్రభుత్వమని అన్నారు. ఐదేళ్లలో 85శాతం హామీలకు ఎగనామంపెట్టినది జగన్ సర్కార్ అని విమర్శించారు. కాంగ్రెస్‌ను అడ్డంపెట్టుకొని రూ.లక్షల కోట్లు దోచుకొని, అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసిపిని స్థాపించారని విమర్శించారు. ఐదేళ్ల పాలనలో 85శాతం హామీలు ఎగనామంపెట్టి ప్రజలకు వెన్నుపోటు పొడిచారని అన్నారు. మద్యపాన నిషేధంపై మాట తప్పి, మడమతిప్పి విషపూరిత మద్యం పోసి పేదల ఆరోగ్యానికే వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. మెగా డీఎస్సీ హామీపై మాట తప్పి యువతకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్ ఎం.మోహన్‌రావు, మాజీ ఎంపిపి సవర కుంపి, మాజీ ఎంపిటిసి బిడ్డక జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న పడాల భూదేవి

బకాయి వేతనాలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జనవరి నుంచి ఏప్రిల్ వరకు జీతాలు, మార్చి, ఏప్రిల్ నెల బిల్లులు వెంటనే విడుదల చేయాలని కార్మికులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఎంఇఒ-2 ఎన్.వెంకటరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై కార్మిక వర్గం ఎన్నో ఆశలతో ఉందని, నాలుగు నెలల జీతాలు, రెండు నెలల బిల్లులు నేటికీ అందకపోవడంతో నిర్వాహకులంతా అప్పుల పాలవుతున్న పరిస్థితి ఉందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా పిల్లలకు నాణ్యమైన భోజనం సమయానికి అందజేస్తున్న భోజనం నిర్వాహకులకు ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డులు, యూనిఫారం, టిఎ, డిఎలు ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా జీతాలు, పోపుల బిల్లులు పెంచాలని, 60 ఏళ్లకు రిటైర్ అవుతున్న వారి కుటుంబాలకు ప్రాధాన్యత ఇచ్చి రిటైర్మెంట్ బెనిఫిట్ ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భోజన నిర్వాహకుల పట్ల నిర్లక్ష్యం విడనాడి సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలని, ఈ డిమాండ్‌తోనే జూలై 9న దేశవ్యాప్త సమ్మె జరుగుతుందన్నారు. కార్మిక వర్గమంతా సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపి మధ్యాహ్నం భోజన కార్మిక సంఘం మండల నాయకులు చొక్కాపు సుశీల, శ్రీదేవి, సీతమ్మ, పట్టణ నాయకులు గొట్టాపు రంగమ్మ, సంతోషి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎపి మధ్యాహ్న భోజన కార్మిక సంఘం డిమాండ్


ఎంఇఒకు వినతిని అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

గరుగుబిల్లి : మధ్యాహ్న భోజన పథకం మెనూ మార్చి, పని భారం పెంచిన ప్రభుత్వం, నిర్వాహకులకు వేతనాలు పెంచాలిని సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ డిమాండ్ చేశారు. మండలంలోని ఉల్లిభద్ర జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో నిర్వహించిన మధ్యాహ్న భోజన నిర్వాహకులు తమ సమస్యలపై నిరసన తెలిపారు. అనంతరం ఎంఇఒ కె.కొండలరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం నాయకులు, పావని, రోహిణి, అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసిపి ఆధ్వర్యాన వెన్నుపోటు దినం

ప్రజాశక్తి - సాలూరు

సాలూరు: టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది లో ఇచ్చిన హామీల అమలు పై చేసిన మోసాలకు నిరసనగా ఈనెల 4న చేపట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షుడు గిరి రఘు కోరారు.బుధవారం ఉదయం పది గంటలకు మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసం నుంచి ర్యాలీగా వెళ్లి బోసు బొమ్మ జంక్షన్ లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు.అనంతరం మండల తహశీల్దార్ కార్యాలయం లో వినతిపత్రం అందజేయనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమానికి పట్టణ నాయకులు, కార్యకర్తలు, కౌన్సిలర్ లు అధిక సంఖ్యలో హాజరు కావాలని వారు ఒక ప్రకటనలో కోరారు.

కురుపాం : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతుందని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. మంగళవారం కురుపాంలో వెన్నుపోటు దినం గోడపత్రికను వైసిపి నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుధవారం చేపట్టబోయే వెన్నుపోటు దినాన్ని కురుపాంలో నిర్వహిస్తున్నామని, కావున మండలంలో గల వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి జి.సుజాత, జిల్లా కో ఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, వైసిపి మైనార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ నూరేళ్ల, వైసిపి జిల్లా అధికారి ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, మండల కో-ఆప్షన్ సభ్యులు షేక్ జిలానీ, నాయకులు షేక్ అదిల్, వి.బంగారు నాయుడు, ఆకుల శ్రీధర్, శెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగులను తక్షణమే తరలించాలి

ప్రజాశక్తి - కొమరాడ

కుంకీ ఏనుగులను జిల్లాకు తీసుకువచ్చి తక్షణమే ఇక్కడున్న ఏనుగుల గుంపును తరలించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు అటవీ శాఖ అధికారులు ఎప్పుడు కుంకీ ఏనుగులు తెస్తా రో వెంటనే పత్రికా ప్రకటన ద్వారా రైతులకు తెలియజేయాలని కోరారు. కర్ణాటక నుంచి ఇప్పటికే నాలుగు కుంకీ ఏనుగులు తేవడం శుభ పరిణామమని, ఆ దిశగా మన జిల్లాకు ఇంతవరకు అధికారులు ఏనుగులు తేకపోవడంతో రైతులు ఎదురుచూసే పరిస్థితి ఉందని అన్నారు. తక్షణమే ఏనుగులను తరలించి సమస్యను పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఊయక వెంకటేష్, చెంబరు బాబురావు పాల్గొన్నారు.

సూరంపేటలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని సూరంపేట పంచాయతీలో పంచాయతీ కార్యదర్శి పి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో పారిశుధ్యం పనులు చేపట్టారు. ముందుగా గ్రామం కాలువల్లో కూడికతీతలు తీయించి, మంచినీరు ట్యాంకులను శుభ్రం చేయించారు. అలాగే వీధుల్లో బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, పెద్దలు పాల్గొన్నారు.

ఏడూళ్ల పోలమాంబ ఆలయ పున: ప్రతిష్ట

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మార్కొండ పుట్టి పంచాయతీ పరిధిలోని పెదఘూశిల, పాతఘూశిల, కేంద్రుక ఘూశిల, కాకులవాని వలస గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత ఏడూళ్ల పోలమాంబ అమ్మవారి ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. మంగళ, బుధ, గురు వారాల్లో ఈ పునః ప్రతిష్ట కార్యక్రమాలు వేద పండితులు దేవీ ఉపవాసకులు విజయకుమార్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోత్సవ సంప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. మంగళవారం నాలుగు గ్రామాల్లో కలశాన్ని ప్రతిష్ఠించే ముందు నాలుగు గ్రామాల్లోని తిరువీధి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాలుగు గ్రామాలకు చెందిన ముత్తైదువులు పెద్ద ఎత్తున పాల్గొని కోలాటాల నడుమ ఊరేగింపు చేపట్టారు. అనంతరం ఆలయంలో కలశాన్ని పూజా నిమిత్తం ఉంచారు.

వనదేవతగా అవతరించి...!

పాత ఘూశిల కేంద్రుక ఘశిలా మధ్య పూర్వకాలంలో వనదేవతగా ఏడు ఊళ్ళ అమ్మవారు అవతరించారని ఈ ప్రాంతవాసులు చెబుతున్నారు. ఆ కాలంలో ఏడు గ్రామాల ప్రజలు అమ్మవారికి పూజలు చేసేవారని, అయితే గత కొద్ది కాలంగా మూడు గ్రామాల ప్రజలు వేర్వేరుగా దేవతలను పూజించుకొనగా మిగిలిన నాలుగు గ్రామాల ప్రజలు ఏడు ఊళ్ల అమ్మవారిని పూజిస్తున్నారు. వెంపడాపు కుటుంబీకులు ఉదారంగా ఇచ్చిన సుమారు 80 సెంట్లు భూమిలో ఆలయ నిర్మాణం చేపట్టారు. నాలుగు గ్రామాలకు సంబంధించిన ప్రజలు సంయుక్తంగా గుడి నిర్మాణానికి చేయూతనందించారు. కేంద్రుక ఘూసిల గ్రామానికి చెందిన గిరిజనులు అనధికాలంగా పూజారులుగా వ్యవహరిస్తున్నారు.

పున్ణ ప్రారంభమవుతున్న పోలమాంబ ఆలయం

నేటి కార్యక్రమాలు..

గుడి ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా బుధవారం నాలుగు గ్రామాల ప్రజలు ఉపవాసాలతో పూజలు ఆచరించి అమ్మవారి మొక్కులు తీర్చుకుంటారు. గురువారం ఆలయ శిఖరంపై కలశ ప్రతిష్టాపన వేదమంత్రాల నడుమ జరగనుంది. అలాగే మహా హోమం, అన్నదానంతో ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాలు ముగియనున్నాయి. ఆలయ నిర్మాణ దాతల్లో అగ్ర భాగం వహిస్తూ పునః ప్రతిష్ట కార్యక్రమాన్ని అమ్మవారి ఆలయ స్థలదాత కుటుంబానికి చెందిన వెంపడా శ్రీనివాసరావు పర్యవేక్షణలో వైభవంగా జరుగుతున్నాయి.

రైతులకు ఆధునిక వ్యవసాయ పరికాలను అందజేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

మోడల్ నియోజకవర్గమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

పాలకొండ నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా చేసేందుకు లక్ష్యంతో పని చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో రైతులకు యాంత్రీకరణ పరికరాలు పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. రైతులను ఆదుకోవాలని లక్ష్యంతో రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. గత వైసిపి పాలనపై దుమ్మెత్తిపోశారు. వీరఘట్టం ఎంపిపి సొంత గ్రామానికి ఆయన అధికారంలో ఉన్నప్పుడు కూడా రహదారి వేసుకోలేకపోయారని, తాము అధికారంలోకి వచ్చి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించినట్లు ఆయన తెలిపారు. బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వెన్నుపోటు దినంగా ప్రకటించారని, ఐదేళ్లలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించడంతో ప్రజల ఎన్నికల్లో బుద్ధి చెప్పినట్లు తెలిపారు. అనంతరం 38 మంది రైతులకు వివిధ రకాలైన యాంత్రీకరణ పరికరాలు, విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పి.కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయభాస్కర్, రామలక్ష్మి నారాయణ, బల్ల హరిబాబు, వ్యవసాయ శాఖ ఎడి కె.రత్నకుమారి, స్థానిక ఎఒ జె.సౌజన్య, ఎఇఒ బి.కృష్ణకాంత్, సిహెచ్ ఉమామహేశ్వరరావు, వెలగాడ శ్రీనివాస్, ఎన్.శశికుమార్, ఎస్.అచ్యుతరావు, కుమారస్వామి, రత్నాకర్, విఎఎలు, రైతులు పాల్గొన్నారు.

మార్పునకు సంకేతం కూటమి విజయం : వైరిచర్ల

ప్రజాశక్తి - కురుపాం

ఎన్‌డిఎ కూటమి 2024లో సాధించిన 164 అసెంబ్లీ సీట్ల ఘన విజయం ప్రజలు మార్పునకు సాంకేతమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ అన్నారు. జూన్ 4తో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ఆయన మంగళవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గతేడాది ఇదే రోజు ప్రజలు తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని, ఇది కేవలం ఓటు కాదని, ప్రజల కోపం, నమ్మకం, ఆశల ఫలితం అహంకార ప్రభుత్వానికి చరమగీతమని, అభివద్ధికి ఆహ్వానమని అన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం ఆర్థికంగా, పరిపాలనాపరంగా చాలా వెనుకబడిందని, అవినీతి, అరాచకాన్ని ప్రజలు తిరస్కరించి చంద్రబాబు నాయకత్వాన్ని మళ్లీ నమ్మారని అన్నారు. ఏడాది కాలంలో రాష్ట్రంలో అభివృద్ధి ప్రాజెక్టులు మళ్లీ మొదలయ్యాయని, పెట్టుబడులు వస్తున్నాయని, రైతులకు, విద్యార్థులకు, యువతకు భరోసా కలిగిందని పేర్కొన్నారు. 164 సీట్ల విజయాన్ని మేము ఒక్కరోజు జ్ఞాపకంగా కాదు ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే బాధ్యతగా చూస్తామని అన్నారు.

రేపు మెగా నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని వండువ జంక్షన్ వద్ద గల షిర్డీ సాయిబాబా జ్ఞాన మందిరంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 5న మెగా నేత్ర శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహకులు ఎం.సింహాచలం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేత్ర వైద్య శిబిరానికి వచ్చిన వారు ఆరోగ్యశ్రీ, ఆధార్, ఇతర గుర్తింపు కార్డులు, బ్యాంకు ఖాతా బుక్, ఫోన్ నెంబరు, రెండు జతలు బట్టలు, గ్లాసు, కంచం తప్పనిసరిగా తీసుకురావాలని నేత్ర రోగులను కోరారు.

గర్భిణులను గుర్తించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

గ్రామాల్లోనే గర్భిణులను గుర్తించి వారి వివరాలను రికార్డులో పొందుపర్చి సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో పడేలా చూడాలని, వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆశా కార్యకర్తలను ఆదేశించారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సి ఆవరణలో ఆశా కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తరచుగా గ్రామాలు సందర్శించి ప్రజల ఆరోగ్య స్థితిగతులు తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లో జ్వరాలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గర్భిణీలకు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ప్రతి నెలా 9న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన్ కార్యక్రమానికి గర్భిణీలను తనిఖీలకు తీసుకురావాలన్నారు. ప్రసవ సమయంలో గర్భిణులను ప్రభుత్వాసుపత్రికి 108 సహాయం ద్వారా ఆసుపత్రికి తరలించాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవం వల్ల తల్లీబిడ్డలు క్షేమమని గర్భిణీలకు అవగాహన కల్పించాలని అన్నారు. సక్రమంగా విధులు నిర్వహించాలని, ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్ధన్‌రావు, శాంతకుమారి, ఆదిలక్ష్మి, సిహెచ్‌ఒలు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లారీ ఢీకొని కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - బొబ్బిలి

లారీ ఢీకొని సిఆర్‌పిఎఫ్ కానిస్టేబుల్ తూముల సత్యం (52) మృతి చెందారు. పోలీసులు వివరాలు మేరకు బాడంగి మండలం ముగడ గ్రామానికి చెందిన సత్యం బొబ్బిలి నుంచి రామభద్రపురం వైపు మోటార్ సైకిల్ పై మంగళవారం వెళ్తుండగా పారాది వద్ద బస్సును ఓవర్ టాక్ చేస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సంఘటన జరిగిన వెంటనే పట్టణ సిఐ కె.సతీష్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. మృతదేహానికి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేశారు.

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధం

ప్రజాశక్తి - సాలూరురూరల్

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ముందుగానే వర్షాలు కురవడంతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్నారు. చెరువులు, వాగులు నిండుకుండలా ఉన్నాయి. దీంతో రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మేలో రుతుపవనాలు పలకరించడంతో ముందుస్తుగానే సాగుకు సన్నద్ధం అవుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో వేసవి దుక్కులు దున్నుకొని పంటలను వేయడానికి సిద్ధంగా ఉన్నారు. గతంలో జూన్, జూలైలో పంటలను వేసుకొనేవారు కానీ ఇప్పుడు రుతుపవనాలు ముందుగానే రావడంతో మేనెలాఖరు జూన్ మొదటి వారాల్లో మొక్కజొన్న, పత్తి పంటలను మండలంలో చాలా గ్రామాల్లో రైతులు వేసుకున్నారు. చాలామంది రైతులు వరి నారుమడులను సిద్ధం చేసుకుంటూ, సారం కోసం పొలం మొత్తం దుక్కులు వేసుకొని కట్టే జనుమును వేసుకున్నారు. మండలంలో అత్యధికంగా వరి, మొక్కజొన్న, పత్తి పంటలను రైతులు సాగుచేస్తున్నారు.

నాణ్యమైన వరి విత్తనాల కోసం రైతులు ఎదురు చూపు

రైతులు ఖరీఫ్ సాగుచేసే క్రమంలో మంచి దిగుబడి వచ్చే వంగడాలు కోసం ఎదురు చూస్తున్నారు. గతంలో ప్రభుత్వం ప్రయోగాత్మకంగా కొత్త రకాల వరి విత్తనాలను రైతులకు అందించడంతో వాటిని నాటిన చాలా మంది రైతులకు వాటి ద్వారా దిగుబడి తగ్గి నష్టపోవాల్సి వచ్చింది. ఈఏడాదైనా అధిక దిగుబడి వచ్చే రకాలను అందజేయాలని రైతులు కోరుతున్నారు.

అన్నదాత సుఖీభవ కోసం ఎదురు చూపు

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సాగు చేసే ప్రతి రైతుకు పెట్టుబడి సహాయం కింద పంటలు వేసే ముందు అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని చెప్పి ఏడాది కావస్తున్నా నేటికీ ఇవ్వకపోవడంతో సన్న, చిన్నకారు రైతులు పెట్టుబడుల కోసం అప్పులు చేసి వ్యవసాయం చేయాల్సిన

నాణ్యమైన విత్తనాల కోసం ఎదురుచూపు

పరిస్థితులు ఉన్నాయి. వేసిన పంటలు సరైన దిగుబడులు రాక పెట్టిన పెట్టిబడులు కూడా రాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించక అప్పులు ఇచ్చిన వారితో మాటలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్‌లోనైనా రైతులకు అన్నదాత సుఖీభవ ఇచ్చినట్లయితే కొంతవరకు సహాయం చేసున్నట్లు అవుతుంది. సాగు చేసే సమయానికి ఇవ్వకపోతే మళ్లీ పెట్టుబడులకు అప్పులు చేయాల్సిన పరిస్థితులు వస్తాయని వాటితో అప్పులు అధికమై పొలాలు అమ్ముకోవలసి వస్తుందని రైతులు వాపోతున్నారు.

అధిక పెట్టుబడులతో సాగుకు వెనుకంజ

ప్రస్తుతం వ్యవసాయం చేయాలంటేనే రైతులు బెంబేలెత్తిపోతున్నారు. ప్రతి పనికీ కూలీలను పిలవాలంటే సమయానికి రాకపోగా, కూలీని కూడా అధికంగా డిమాండ్ చేయడంతో వ్యవసాయం వదల్లేక, మరో పని చేయలేక రైతులు అయోమయ పరిస్థితిలో ఉన్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా రైతు విషయంలో అన్ని చేశాం.. ఇన్ని చేశామని చెప్పడం తప్ప పెట్టుబడులు తగ్గించే ప్రయత్నాలు చేయకపోవడం, పండించిన పంటకు గిట్టుబాటు ధరలు లేక రైతులు వ్యవసాయాన్నివిరమించుకునే పరిస్థితులు ఉన్నాయి. ఇలాగే పరిస్థితులు ఉంటే రాబోయే కాలంలో వ్యవసాయం చేసేవారు ఎవరూ మిగలరని, దీనికోసం ప్రభుత్వాలు ఇప్పటి నుంచైనా రైతులు వ్యవసాయం చేసుకొనేలా అన్ని రకాల సహాయ సహకారాలు అందించేలా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

విత్తనాలు సిద్ధం

ఖరీఫ్ సీజన్లో రైతులకు కావాల్సిన అన్ని రకాల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే అన్ని గ్రామ సచివాలయాల్లో రైతులకు విత్తనాలు అందుబాటులో ఉంచాం. ఏ రైతు కూడా విత్తనం దొరకలేదని భయపడాల్సిన అవసరం లేదు. ఈ ఏడాది 1061, స్వర్ణ, సాంబా, ఆర్ జివిల్ మొదలగు రకాలు విత్తనాలను సిద్ధం చేశాం. మండలం మొత్తం ఈ ఏడాది 5వేల ఎకరాల్లో వరి సాగు చేయడానికి సరిపడా విత్తనాలు ఉన్నాయి. మొక్క జొన్న, పత్తి కూడా అధికంగా సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపుతున్నారు.

అనురాధా పండా, మండల వ్యవసాయాధికారి

ఖరీఫ్ దుక్కు దున్నుతున్న రైతు

గిట్టిబాటు ధర ఏదీ?

ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు దళారులను నమ్మి నష్టాలబారిన పడుతున్నా ప్రభుత్వాలు కనీసం మద్దతు ధర కూడా ప్రకటించకుండా పండించిన పంటను కొనుగోలు చేయకుండా తాత్సరం చేస్తుంది. రైతుల దగ్గర పంటలు పండి చేతికి అందికొచ్చిన సమయానికి ప్రభుత్వాలు ఏమీ చేయకపోవడంతో దళారీలకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు దాపురించాయి. పంటను అంతా దళారీలు కొనుగోలు చేసిన తర్వాతనే ఇస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించి మమ అనిపించడం తప్ప సరైన మద్దతు ధరను ఇచ్చి సమయానికి కొనుగోలు చేసే దాఖలాల్లేవు.

వంటల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

మధ్యాహ్న భోజన పథకం వంటల్లో నిర్వాహకులు తప్పనిసరిగా నాణ్యత పాటించాలని ఎంఇఒ-2 ఎన్.వెంకటరావు తెలిపారు. మంగళవారం స్థానిక కెహెచ్ పాఠశాల వద్ద మధ్యాహ్న భోజన నిర్వాహలకు విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఒకరోజు జరిగిన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంఇఒ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో మధ్యాహ్న భోజనం నిర్వహిస్తుందని, అటువంటి కార్యక్రమంలో నిర్వాహకులు నాణ్యతతో కూడిన వంటకాలు వండి విద్యార్థులకు అందించాలని, ఇందులో ఎటువంటి తప్పులు జరగకుండా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రోగ్రాం అసోసియేట్స్ విజయకుమార్, జగన్మోహన్ మాట్లాడుతూ పోషణ, పోషకాహారం ప్రాధాన్యత, ఫుడ్ ఫోర్టిఫికేషన్ పరిశుభ్రత గురించి నిర్వాహకులకు శిక్షణను నిర్వహించారు. కార్యక్రమంలో వర్కర్స్, సీఆర్పీలు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి

ప్రజాశక్తి - సీతానగరం

క్షయ నిర్మూలనకు కృషి చేయాలని స్థానిక వైద్యాధికారి రమ్య సాయి అన్నారు. మండలంలోని పెద్ద అంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశాడే సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 5 నుంచి ప్రారంభమయ్యే క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని వంద రోజులు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాల్లో రోగులను గుర్తించిన అనంతరం ప్రాథమిక ఆరోగ్యంద్రానికి తీసుకురావాలన్నారు. కుష్టువ్యాధి నివారణపై కూడా కృషి చేయాలని టిపిఎంఒ మూర్తి అన్నారు. గ్రామాల్లో గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌వి వరలక్ష్మి, హెచ్ఎస్ గోపాలరావు, ఇఒ సూర్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.